సాక్షి
కామారెడ్డి
బుధవారం । 19 । ఫిబ్రవరి । 2025



పీహెచ్‌సీకి సుస్తీ!
నాగిరెడ్డిపేట పీహెచ్‌సీలో సిబ్బంది సమయ పాలన పాటించకపోవడంతో రోగులకు సరైన సేవలు అందడం లేదు.
- 9లో ▸



నాణ్యమైన భోజనం అందించాలి
విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
34.6 /13.4

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరగవచ్చు. రాత్రి మంచు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

లైంగిక దాడులు జరగకుండా చూడాలి

● సీనియర్ సివిల్ జడ్జి నాగరాణి



కామారెడ్డి క్రైం : పాఠశాలల్లో విద్యార్థులపై లైంగిక దాడులు జరగకుండా చూడాలని సీనియర్ సివిల్ జడ్జి నాగరాణి ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం కామారెడ్డిలోని కళాభారతి ఆడిటోరియంలో చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులుగా ఎంపిక చేసిన ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో ఏవైనా పోక్సో సంబంధిత ఘటనలు ఎదురైతే వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదు చేసిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతారన్నారు. పిల్లల విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు బ్యాడ్జీలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, యునిసెఫ్‌కు చెందిన చైల్డ్ ప్రొటెక్షన్ స్పెషలిస్ట్ సోని కుట్టి, జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, డీసీపీవో స్రవంతి, సీడబ్ల్యూసీ మెంబర్ స్వర్ణలత, బాల రక్షక్ భవన్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై దృష్టి సారించండి



కామారెడ్డి క్రైం: వేసవి కాలంలో జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఏ.శరత్ సూచించారు. మంగళవారం జిల్లాకు విచ్చేసిన ఆయన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న చోట్ల ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. అవసరమైతే బోరుబావులను అద్దెకు తీసుకోవాలని సూచించారు.

'మహిళల భద్రతకు ప్రాధాన్యత'



కామారెడ్డి క్రైం: మహిళలు, బాలికల భద్రతకు భరోసా కేంద్రం ప్రాధాన్యత ఇస్తోందని ఏఎస్పీ నరసింహారెడ్డి పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో భరోసా కేంద్రం ప్రారంభమై ఏడాది గడుస్తున్న సందర్భంగా మంగళవారం వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ పోక్సో, మహిళలపై అత్యాచారాల కేసులను నియంత్రించడానికి భరోసా కేంద్రం ద్వారా పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బాధితులకు అండగా ఉంటున్నామని, న్యాయ సలహాలు, వైద్యం తదితర సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటివరకు 72 కేసులలో బాధితులకు కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. ఆర్థికంగా వెనకబడిన 45 కుటుంబాలకు రూ. 10.12 లక్షలు సహాయం అందించామన్నారు. పోక్సో, అత్యాచార కేసుల్లో బాధిత మహిళలు, బాలికలకు సత్వర న్యాయం జరిగేలా కృషి చేస్తున్న భరోసా కేంద్రం సిబ్బందిని అభినందించారు.

'మర్యాదపూర్వకంగా మెలగాలి'




కామారెడ్డి టౌన్ : ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మెలగాలని కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుస్రోషా ఖాన్ సూచించారు. మంగళవారం కామారెడ్డి ఆర్టీసీ డిపోలో సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఈడీ పాల్గొన్నారు. సంస్థ ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేయాలన్నారు. ప్రమాద రహిత డిపోగా పేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఇందిర, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

■ కామారెడ్డి పట్టణ పరిధిలోని దేవునిపల్లికి చెందిన సంజయ్ అనే యువకుడు ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసయ్యాడు. అప్పులు చేసి మరీ ఆడాడు. సుమారు రూ.కోటిపైనే అప్పులయ్యాయి. వాటిని తీర్చే దారి తెలియక ఈనెల 17న ఆత్మహత్య చేసుకున్నాడు.

■ దేవునిపల్లి గ్రామానికే చెందిన రాకేశ్ అనే వ్యక్తి ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లలో భారీగా నష్టపోయాడు. సొంత డబ్బులు పోనూ మరో రూ.15 లక్షలకు పైగా అప్పులు చేశాడు. ఆ అప్పులు తీర్చే మార్గం తెలియక మనస్తాపానికి గురై గతేడాది సెప్టెంబర్ 4న బలవన్మరణానికి పాల్పడ్డాడు.

యువతరం ఆన్‌లైన్ ఆటలు, బెట్టింగ్ ఊబిలో కూరుకుపోతోంది. సులువుగా డబ్బులు సంపాదించాలన్న అత్యాశతో అప్పులు చేసి మరీ ఆటలాడుతున్నారు. చూస్తుండగానే అప్పులు కుప్పలుగా పేరుకుపోతున్నాయి. దీంతో వాటిని తీర్చే దారి తెలియక మానసికంగా కుంగిపోయి కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మరికొందరు ఊరు విడిచి పారిపోతున్నారు.



డెత్ గేమ్..!

ఆన్‌లైన్ ఆటల ఊబిలో యువత
- రూ. లక్షల్లో నష్టపోతున్నా బయటకు రాలేని బలహీనత
- అప్పులు తీర్చలేక ఆత్మహత్య
- రోడ్డున పడుతున్న కుటుంబాలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : స్మార్ట్‌ఫోన్ల రాకతో సాంకేతిక పరిజ్ఞానం అందరికీ అందుబాటులోకి వచ్చింది. అరచేతిలో ప్రపంచం కనబడుతోంది. విద్య, ఉద్యోగం, ఉపాధి.. ఇలా ప్రతి దానికి స్మార్ట్‌ఫోన్లను వినియోగిస్తున్నారు. అయితే వాటితో మంచి ఎంత ఉందో చెడు అంతే ఉంది. సులువుగా డబ్బులు సంపాదించవచ్చనే ప్రచారంతో యువత, విద్యార్థులు వాటివైపు మళ్లుతున్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్ గేమ్‌లు, బెట్టింగ్‌లకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

అత్యాశకు పోయి..

పల్లె, పట్నం తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో యువత పొద్దస్తమానం చేతిలో సెల్‌ఫోన్ పట్టుకుని ఆన్‌లైన్ ఆటల్లో మునిగి తేలుతోంది. కొందరు విద్యార్థులు కూడా ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి చదువులను నాశనం చేసుకుంటున్నారు. ఆన్‌లైన్ ఆటలతో సులువుగా డబ్బులు సంపాదించుకోవచ్చంటూ సోషల్ మీడియాలో వస్తున్న యాడ్స్.. వాళ్లను అటువైపు మరలేలా చేస్తున్నాయి. లేని ఆశలకు పోయి ఆన్‌లైన్ గేముల్లో రూ.లక్షలు తగలేస్తున్నారు. అప్పులు చేసి మరీ ఆడుతున్నారు. తాము నష్టపోతున్నామని తెలుసుకునేసరికి అప్పులు పెరిగిపోయి ఆస్తులకు ఎసరు వస్తోంది. ఈ క్రమంలో కన్నవారితో గొడవలకు దిగుతున్నారు. డబ్బులు ఇవ్వకుంటే ఆత్మహత్య చేసుకుంటామంటూ తల్లిదండ్రులను బ్లాక్‌మెయిల్ చేస్తున్న ఘటనలూ ఉన్నాయి. దీంతో కొందరు తల్లిదండ్రులు ఆస్తులు అమ్మి చేతుల్లో పెడుతున్నారు. ఇంకొందరు కుటుంబ సభ్యులకు సమాధానం చెప్పలేక, అప్పులు తీర్చే మార్గం కానరాక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. జిల్లాలో ఇటీవలి కాలంలో ఆత్మహత్య చేసుకున్న కొందరు యువకుల కేసులను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. జిల్లా కేంద్రం పరిధిలో ఇప్పటికే ఆరుగురు యువకులు ఆన్‌లైన్ గేమ్‌లతో నష్టపోయి ఆత్మహత్యలకు పాల్పడినట్టు తెలుస్తోంది. చేతికందిన కొడుకు తమ కళ్ల ముందే చనిపోవడంతో కన్నవారికి కడుపుకోత మిగులుతోంది. ఇదే సమయంలో అప్పులు తీర్చడం, కుటుంబాన్ని పోషించడం వారికి భారంగా మారుతోంది. అప్పులు తీర్చలేక కొందరు ఆత్మహత్య చేసుకోగా.. మరికొందరు బిచాణా ఎత్తేశారు. దీంతో వారికి అప్పులు ఇచ్చినవారు లబోదిబోమంటున్నారు.

" కెరీర్ మీద దృష్టి పెట్టాలి



ఇంటర్నెట్‌ను మంచి కోసం వాడుకుంటే ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు. ముఖ్యంగా చదువు, పోటీ పరీక్షలకు అవసరమైన సమాచారాన్ని తీసుకోవచ్చు. కానీ కొందరు దానిని సరిగా వాడుకోలేకపోతున్నారు. సులువుగా డబ్బులు సంపాదించొచ్చన్న అత్యాశతో కొందరు ఆన్‌లైన్ గేమ్స్‌కు, బెట్టింగ్‌కు అలవాటు పడి నష్టపోతున్నారు. ఈ విషయంలో యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని భావిస్తున్నాం.
-బి.చైతన్య, ఏఎస్పీ, కామారెడ్డి

■ బాన్సువాడకు చెందిన సాయికుమార్ ఆన్‌లైన్‌లో ఆటలాడి అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం కానరాకపోవడంతో అడ్డదారి తొక్కాడు. ఓ వృద్ధురాలి మెడలోనుంచి బంగారు నగలు దొంగిలించే క్రమంలో ఆమెను హత మార్చాడు. చివరికి జైలు పాలయ్యాడు.

■ బాన్సువాడ పట్టణానికి చెందిన ఓ యువకుడు ఆన్‌లైన్ బెట్టింగ్, ఆటల్లో సుమారు రూ.2 కోట్లు పోగొట్టుకున్నాడు. అప్పులు ఇచ్చినవారికి మొండిచేయి చూపి పారిపోయాడు.

■ నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో ఇద్దరు అన్నదమ్ములు ఆన్‌లైన్ ఆటలకు బానిసలై అప్పుల పాలయ్యారు. అప్పులు తీర్చేమార్గం లేకపోవడంతో ఊరు విడిచి పారిపోయారు. కొడుకులు చేసిన అప్పులు తీర్చేందుకు వారి తల్లిదండ్రులు ఇంటిని అమ్మేందుకు సిద్ధపడ్డారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై కాంగ్రెస్ ఫోకస్!



బీర్కూర్‌లో కాంగ్రెస్ కార్యకర్తలతో మాట్లాడుతున్న ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్

- నేడు కామారెడ్డి, బాన్సువాడలలో సమావేశాలు
- హాజరుకానున్న పీసీసీ చీఫ్, జిల్లా మంత్రి

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : పట్టభద్రుల శాసన మండలి స్థానంపై కాంగ్రెస్ పార్టీ ఫోకస్ చేసింది. ఎన్నికల తేదీ సమీపిస్తుండడంతో ప్రచారాన్ని ముమ్మరం చేయడానికి పార్టీ ముఖ్యనేతలు రంగంలోకి దిగారు. ఇందులో భాగంగా బుధవారం కామారెడ్డి, బాన్సువాడ పట్టణాల్లో కేడర్‌తో సమావేశాలు నిర్వహించనున్నారు.

శాసన మండలి ఎన్నికలు ఈనెల 27న జరగనున్నాయి. ఇప్పటివరకు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగానీ, ముఖ్య నేతలు గానీ ప్రచారం నిర్వహించలేదు. ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో పార్టీ ముఖ్య నేతలంతా రంగంలో దిగుతున్నారు. ఎమ్మెల్సీ స్థానాన్ని నిలబెట్టుకోవడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. అందులో భాగంగా జిల్లాలో రెండు సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. బుధవారం ఉదయం 10 గంటలకు కామారెడ్డి పట్టణంలోని సత్య గార్డెన్‌లో, మధ్యాహ్నం 1.30 గంటలకు బాన్సువాడ పట్టణంలోని ఎస్ఎంబీ గార్డెన్‌లో సమావేశాలు నిర్వహించనున్నారు. ఆయా సమావేశాలకు పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతారావు హాజరుకానున్నారు.

సన్నాహక సమావేశానికి తరలిరావాలి

బాన్సువాడ : బాన్సువాడలో బుధవారం నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి కార్యకర్తలు తరలిరావాలని ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ కోరారు. మంగళవారం నియోజకవర్గంలోని పొతంగల్, బీర్కూర్, వర్ని, కోటగిరి, నస్రుల్లాబాద్ మండలాల్లో ఆయన కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం మధ్యాహ్నం బాన్సువాడలో నిర్వహించే సమావేశానికి పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తోపాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరు కానున్నారన్నారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు పవన్, బోయిని శంకర్, యామ రాములు, కాశీరాం, విజయ్‌ప్రకాష్, దాసరి శ్రీనివాస్, ప్రసాద్, ప్రశాంత్, గౌస్ తదితరులు ఉన్నారు.

డీసీసీబీని అగ్రస్థానంలో నిలపాలి

సుభాష్‌నగర్(నిజామాబాద్ అర్బన్): ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా రైతులకు స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు అందించి రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థానంలో నిలపాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. డీసీసీబీ పాలకవర్గం, సహకార సంఘాల కాల పరిమితిని ఆరు నెలలు పొడిగించినందుకు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. రైతుల సంక్షేమానికి కృషి చేయడంతోపాటు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం బాధ్యతతో పని చేయాలని సీఎం సూచించారని రమేశ్‌రెడ్డి తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డితో డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి

మొక్కలు ఎండిపోకుండా చూడాలి

● కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

గాంధారి: నర్సరీల్లోని మొక్కలు ఎండిపోకుండా షేడ్ నెట్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన పేట్‌సంగెం గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని వైకుంఠధామం, కంపోస్ట్ షెడ్, నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ కంపోస్టు ఎరువులను తయారు చేయాలని ఆదేశించారు. వేసవిలో మారుమూల గ్రామాలు, తండాల్లో తాగు నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు ప్రశ్నలు సంధించి వారి సామర్థ్యాలను పరీక్షించారు. అర్థం కాని విషయాలుంటే టీచర్లను అడిగి తెలుసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పదో తరగతి తరువాత ఐఐఐటీల్లో చేరాలని సూచించారు. విద్యార్థులను పదో తరగతి పరీక్షలకు సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. మధ్యాహ్న భోజనాన్ని, వంటశాలలను పరిశీలించారు. నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. ఆయన వెంట డీఆర్‌డీవో సురేందర్, డీపీవో శ్రీనివాస్ రావు, మండల ప్రత్యేకాధికారి లక్ష్మీప్రసన్న, డీఎల్పీవో సురేందర్, తహసీల్దార్ సతీష్ రెడ్డి, ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో లక్ష్మీనారాయణ తదితరులున్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

టీచర్‌పై సస్పెన్షన్ వేటు

కామారెడ్డి టౌన్: విద్యార్థినిపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న గాంధారి మండలానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రమేశ్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి రాజు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పోక్సో చట్టం కింద రమేశ్‌పై కేసు నమోదయ్యిందని, ఈ నేపథ్యంలో క్రమశిక్షణ చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. సదరు ఉపాధ్యాయుడు ముందస్తు అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్ వదిలి వెళ్లరాదన్నారు.

నరహంతకుడు, తల్లికీ జీవితఖైదు

- కవల పిల్లల హత్య కేసుల్లో నిజామాబాద్ జిల్లా కోర్టు తీర్పు
- స్నేహితుడి కుటుంబాన్నే హతమార్చిన వైనం..
- మొత్తం ఆరుగురి హత్య.. కొనసాగుతున్న మిగతా కేసుల విచారణ

ఖలీల్‌వాడి: ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురి హత్య కేసులలోని రెండు కేసుల్లో ఇద్దరికి జీవిత ఖైదు విధిస్తూ నిజామాబాద్ జిల్లా జడ్జి సునీత కుంచాల మంగళవారం తీర్పు చెప్పారు. జిల్లా కోర్టులోని తన చాంబర్‌లో పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి రాజేశ్వర్‌రెడ్డి మీడియాకు తెలిపిన తీర్పు వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలోని మాక్లూర్ మండలానికి చెందిన పూన ప్రసాద్, అతని భార్య రమణి, ఇద్దరు చెల్లెళ్లు శ్రావణి, స్వప్న, కవల పిల్లలు అయిన కూతురు పూన చైత్రిక, బాబు చైత్రిక్‌లను ఆస్తికోసం ఒకరికి తెలియకుండా ఒకరిని నిందితుడు మేడిద ప్రశాంత్, అతని తల్లి ఒడ్డెమ్మ, తమ్ముడితోపాటు ఇద్దరు స్నేహితుల సహకారంతో చంపాడు. నిందితుడు అద్దెకు తెచ్చుకున్న కారులో శవాలను వివిధ ప్రదేశాలలో పడేశాడు. 2023 డిసెంబర్ 30న మెండోరా మండలంలోని దూదిగాం గ్రామ శివారులోని గోదావరి నది సోన్ బ్రిడ్జి వద్ద కవల పిల్లలు చైత్రిక, చైత్రిక్ శవాలను వేరువేరు ప్లాస్టిక్ సంచిలలో మూటకట్టి పడేశారు. కవలల హత్యపై మెండోరా పీఎస్‌లో రెండు కేసులు నమోదు అయ్యాయి. ఈ రెండు కేసులలో కోర్టులో విచారణ అనంతరం జిల్లా జడ్జి సునీత కుంచాల నిందితులు అయిన మాక్లూర్ గ్రామానికి చెందిన మేడిద ప్రశాంత్, అతని తల్లి మేడిద ఒడ్డెమ్మలకు జీవిత ఖైదు విధించారు. మెండోరా పోలీసులు చార్జిషీట్ దాఖలు చేసిన తర్వాత 28 మంది సాక్ష్యాలను పరిశీలించిన అనంతరం ఇద్దరికి జీవితఖైదుతోపాటు రూ.2 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని యెడల ఆరు నెలల జైలు శిక్ష అనుభవించాలని జిల్లా జడ్జి తీర్పులో పేర్కొన్నారు. దీంతోపాటు సాక్ష్యాలు తారుమారు చేసినందుకు ఏడు సంవత్సరాలతో పాటు రూ.1,000 జరిమానా చెల్లించాలని లేకుంటే మరో మూడు నెలల జైలు శిక్ష, అలాగే ఆస్తి కాజేసేందుకు ప్రయత్నించినందుకు మరో ఏడు ఏళ్ల శిక్షతోపాటు రూ.1,000 చెల్లించాలని లేకుంటే మరో మూడు నెలలపాటు శిక్ష అనుభవించాలని తీర్పు ఖరారు చేశారు. ఈ శిక్షలను ఏకకాలంలో అనుభవించాలని స్పష్టం చేశారు. మృతుల పక్షాన పీపీ రాజేశ్వర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఇంకా నాలుగు కేసుల్లో విచారణ కొనసాగుతోంది. ప్రసాద్‌ను హత్య చేసి మాక్లూర్ మండలంలోని ముదక్‌పల్లిలోని అటవీ ప్రాంతంలో పూడ్చివేశారు. ప్రసాద్ పెద్ద చెల్లెలు శ్రావణి హత్య కేసు మేడ్చల్ జిల్లాలో, చిన్న చెల్లెలు స్వప్న కేసు కామారెడ్డి జిల్లా సదాశివనగర్‌లో, ప్రసాద్ భార్య రమణి హత్య కేసు నిజామాబాద్ జిల్లాలోని నవీపేట్ పోలీస్‌స్టేషన్‌లో కొనసాగుతున్నాయి. త్వరలో వీటిపై కూడా తీర్పు వస్తుందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పేర్కొన్నారు.





జీవిత ఖైదు పడిన ప్రశాంత్

సరికొత్తగా పోలీసు!

- ప్రతి కానిస్టేబుల్‌కు డ్రైవింగ్‌లో శిక్షణ
- తొలిసారిగా మహిళా కానిస్టేబుళ్లతో క్యూఆర్‌టీ ఏర్పాటు

కామారెడ్డి క్రైం: నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా పోలీస్ శాఖ సరికొత్తగా ముందుకు సాగుతోంది. అత్యవసర విభాగాల్లో పని చేసే సిబ్బందికి డ్రైవింగ్ నైపుణ్యాలు పెంపొందించేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాగే తొలిసారిగా జిల్లాలో మహిళా కానిస్టేబుళ్లతో క్యూఆర్‌టీ(క్విక్ రియాక్షన్ టీం)లను ఏర్పాటు చేశారు. ఆందోళన కార్యక్రమాలు, శాంతి భద్రతలకు విఘాతం ఏర్పడే అవకాశం ఉన్న సమయాల్లో ఆయా బృందాలు వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని చక్కబెట్టేందుకు అవకాశాలుంటాయని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

189 మంది కొత్త కానిస్టేబుళ్లు..

కొత్తగా ఉద్యోగాలు సాధించిన 189 మంది కానిస్టేబుళ్లు 9 నెలల శిక్షణ పూర్తి చేసుకుని గతేడాది నవంబర్‌లో విధుల్లో చేరారు. ఇందులో సివిల్ కానిస్టేబుళ్లు 115 మంది, ఏఆర్ కానిస్టేబుళ్లు 74 మంది ఉన్నారు. సివిల్‌లో 75 మంది పురుషులు, 40 మంది మహిళా కానిస్టేబుళ్లు ఉండగా.. ఆర్మ్‌డ్ రిజర్వ్‌లో 58 మంది పురుషులు, 16 మంది మహిళా కానిస్టేబుళ్లు ఉన్నారు. వీరికి విధుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలు, వ్యవహరించాల్సిన తీరు, అప్రమత్తత, బందోబస్తు తదితర అంశాలపై ఇప్పటికే జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. సీనియర్లతో శిక్షణ తరగతులు ఏర్పాటు చేసి ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. అత్యవసర విభాగాల్లో పని చేసే సిబ్బందికి వాహనాలను నడపడంలో నైపుణ్యాలు ఎంతో ముఖ్యం. ఈ నేపథ్యంలో కొత్త కానిస్టేబుళ్లందరికీ డ్రైవింగ్‌లో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఎస్పీ సింధు శర్మ సూచనల మేరకు సబ్ డివిజన్‌ల వారీగా శిక్షణ కార్యక్రమాలు నడుస్తున్నాయి. ఇప్పటికే పలు విడతలలో 75 మందికి డ్రైవింగ్‌లో శిక్షణ పూర్తయ్యింది. మిగిలినవారికి త్వరలోనే శిక్షణ ఇవ్వనున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.



శిక్షణ పొందుతున్న క్విక్ రియాక్షన్ టీం సభ్యులు (ఫైల్)

క్విక్ రియాక్షన్ టీంలు..

ఇప్పటివరకు పురుష కానిస్టేబుళ్లతో కూడిన క్విక్ రియాక్షన్ టీంలు ఉన్నాయి. ప్రస్తుతం తొలిసారిగా మహిళా కానిస్టేబుళ్లతో డివిజన్‌ల వారీగా క్యూఆర్‌టీలు ఏర్పాటు చేశారు. ఎక్కడైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగే ఘటనలు జరిగితే క్యూఆర్‌టీ బృందాలు వెంటనే అక్కడకు చేరుకుంటాయి. పరిస్థితిని అదుపు చేయడానికి వారు కృషి చేస్తారు. క్యూఆర్‌టీ సభ్యులు నిత్యం వాహనాల తనిఖీలు, బందోబస్తు చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, రద్దీగా ఉండే ప్రదేశాల్లో తనిఖీ చేపట్టడంలాంటి విధుల్లో పాల్గొననున్నారు.



డ్రైవింగ్‌లో శిక్షణ తీసుకుంటున్న మహిళా కానిస్టేబుల్

శిక్షణ ఇస్తున్నాం..



జిల్లాలో కొత్తగా విధుల్లో చేరిన కానిస్టేబుళ్లకు అన్ని అంశాలపై అవగాహన కల్పించాం. మహిళా కానిస్టేబుళ్లతో క్విక్ రియాక్షన్ టీంలను ఏర్పాటు చేశాం. వారికి విధులపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం పూర్తయ్యింది. అత్యవసర సమయాల్లో అవసరం ఉంటుంది కాబట్టి ప్రతి ఒక్కరికీ డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తున్నాం.
– సింధు శర్మ, ఎస్పీ

క్లుప్తంగా

కేకేవై రోడ్డును నేషనల్ హైవేగా గుర్తించాలి



ఎల్లారెడ్డి రూరల్: కరీంనగర్– కామారెడ్డి– ఎల్లారెడ్డి(కేకేవై) రోడ్డును నేషనల్ హైవేగా గుర్తించాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు.. మంత్రి కోమటిరెడ్డికి విన్నవించారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి నివాసంలో ఆయనను ఎమ్మెల్యే కలిసి ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

అనుకూలమైన స్థలంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయండి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మేజర్‌వాడిలో ఏర్పాటు చేయనున్న అంబేడ్కర్ విగ్రహాన్ని అందరికి అనుకూలంగా ఉండే స్థలంలో ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామానికి చెందిన ఓ వర్గం ప్రజలు మంగళవారం స్థానిక తహసీల్ కార్యాలయానికి తరలివచ్చారు. సోమవారం అధికారులు ఎంపిక చేసిన స్థలం అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు అనుకూలంగా లేదని, గ్రామస్తులతో చర్చించి అందరికీ అనుకూలంగా ఉండే స్థలాన్ని ఎంపిక చేయాలని వారు తెలిపారు. అప్పటివరకు విగ్రహ ఏర్పాటు పనులను నిలిపేయించాలని వారు కోరారు. ఈ మేరకు తహసీల్దార్‌తోపాటు ఎస్సైకి వారు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేసేందుకు వారు కలెక్టరేట్‌కు తరలివెళ్లారు.

నిరంతరం పర్యవేక్షించాలి

- నీటి ఎద్దడి తలెత్తకుండా కార్యాచరణ రూపొందించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి



సీఎస్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు, అధికారులు

కామారెడ్డి క్రైం: రానున్న వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని సీఎస్ శాంతి కుమారి సూచించారు. మంగళవారం ఆమె హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో మాట్లాడారు. సాగునీరు, తాగునీరు, విద్యుత్ సరఫరా, రైతు భరోసా, యూరియా కొరత, రేషన్ కార్డుల జారీ, రెసిడెన్షియల్ పాఠశాలల సందర్శన తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీటి సమస్య ఏర్పడకుండా తగిన కార్యాచరణ రూపొందించాలన్నారు. రబీ సీజన్‌కు సాగునీటి సమస్య లేకుండా ప్రాజెక్టులు, చెరువులపై సమీక్షించి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. యూరియా కొరత లేకుండా చూడాలన్నారు. వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హత గల ప్రతి రైతుకు రైతు భరోసా అందేలా చూడాలన్నారు. ప్రజాపాలనలో రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు జారీ చేయాలన్నారు. గురుకుల పాఠశాలలను జిల్లా అధికారులు సందర్శించి, సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

17 ప్రాంతాల్లో సమస్య..

జిల్లాలో 860 ఆవాస ప్రాంతాలు ఉండగా 17 చోట్ల తాగునీటి సమస్య ఉందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆయన జిల్లా అధికారులతో మాట్లాడారు. సమస్య ఉన్న గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. బోర్ వెల్స్‌కు అవసరమైన మరమ్మతులు చేయించాలన్నారు. రేషన్ కార్డుల వెరిఫికేషన్‌కు సంబంధించి రోజువారీ రిపోర్టులు సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, సబ్ కలెక్టర్ కిరణ్మయి, నీటిపారుదల శాఖ సీఈ రవి, మిషన్ భగీరథ ఎస్ఈ రాజేంద్ర కుమార్, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్ కుమార్, డీఏవో తిరుమల ప్రసాద్, ఆర్డీవో ప్రభాకర్, డీపీవో శ్రీనివాస్‌రావు, డీఎస్‌వో మల్లికార్జున్ బాబు పాల్గొన్నారు.

ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలి



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి విజయ

రాజంపేట: ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించాలని రాజంపేట్ మండల వైద్యాధికారి విజయ మహాలక్ష్మి తెలిపారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 76 మంది మహిళలకు రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మహిళలు ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించాలని, పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. హెల్త్ సూపర్వైజర్ మంజూర్ తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

లింగంపేట పీహెచ్‌సీలో అమ్మ ఒడి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం అమ్మ ఒడి కార్యక్రమం నిర్వహించినట్లు డాక్టర్ హిమబిందు తెలిపారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో బాధపడుతున్న స్త్రీలు, గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పలువురికి రక్త పరీక్షలు చేసి నమూనాలను టి–హబ్‌కు పంపినట్లు తెలిపారు. రక్తహీనతతో బాధపడుతున్న వారికి ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలి



తాడ్వాయి మండల పరిషత్‌లో ఇంటింటి సర్వే వివరాలను తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): గ్రామాలలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆయన మంగళవారం తాడ్వాయి మండల కేంద్రాన్ని సందర్శించారు. అధికారులు గ్రామాలలో తిరుగుతూ తాగునీటి సమస్యలు ఉన్న గ్రామాలను గుర్తించి సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేసి సమగ్ర కుటుంబసర్వేకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్నులను 100 శాతం వసూలు చేయాలని సూచించారు. అనంతరం తాడ్వాయి శివారులోని నర్సరీని పరిశీలించారు. ప్రతిరోజు మొక్కలకు నీటిని పోసి మొక్కలు ఏపుగా పెరిగేలా చూడాలన్నారు. మండల ప్రత్యేక అధికారి రాజారాం, ఎంపీడీవో సయ్యద్ సాజిద్, ఎంపీవో సవితారెడ్డి, గ్రామ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం

కామారెడ్డి టౌన్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నేడు జిల్లా కేంద్రంలోని సత్యగార్డెన్‌లో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ముఖ్య అతిథిగా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీలు హాజరవుతున్నారని తెలిపారు. పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, నాయకులు సందీప్, చందు, కిరణ్, గంగాధర్ తదితరులున్నారు.

'నిరుపేద ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి'



ప్రమాణస్వీకారం చేస్తున్న కార్యవర్గసభ్యులు

భిక్కనూరు: నిరుపేద ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషిచేస్తానని భిక్కనూరు ఆర్యవైశ్యసంఘం నూతన అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన పురాం రాజమౌళి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం జరిగింది. ప్రధాన కార్యదర్శిగా చల్ల లక్ష్మణ్, కోశాధికారిగా కోడిప్యాక వెంకటేశంలతో పాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడు పురాం రాజమౌళి మాట్లాడుతూ.. వైశ్య సంఘం అభివృద్ధితో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతానన్నారు. అలాగే విద్యలో ప్రతిభ చూపుతున్న నిరుపేదల ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం అందజేస్తానన్నారు. ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పబ్బ నాగరాజు, శ్రీరాం చంద్రశేఖర్, గంగెల్లి మధుసూదన్, అతిమాముల శ్రీధర్, చీకోటి నాగభూషణం, అతిమాముల రమేష్, బంక్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పాత కక్షలతో ఒకరి హత్య!



లింగంపేట(ఎల్లారెడ్డి): పాత కక్షలతో ఒకరిని హత్య చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పిట్లం మండలం బొల్లక్‌పల్లి, లింగంపేట మండలం బాణాపూర్ గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. పిట్లం మండలం బొల్లక్‌పల్లి గ్రామానికి చెందిన ఉప్పరి పోచయ్య(70) ఈనెల 1న తన ఇంటి ఆరుబయట నిద్రించాడు. మరుసటి రోజు నుంచి అతడు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా బొల్లక్‌పల్లి గ్రామానికి చెందిన అనుమానితుడిని విచారించారు. అనుమానితుడికి, మృతుడికి మధ్య భూ వివాదంతోపాటు పలు విషయాలపై పాత కక్షలు ఉండగా, తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిసింది. దీంతో హత్య చేసిన ప్రదేశమైన లింగంపేట మండలం బాణాపూర్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలోకి పోలీసులు అనుమానితుడిని తీసుకెళ్లి ఆధారాలు సేకరించారు. పోచయ్యను ఒక్కడే హత్య చేశాడా..? మరెవరైనా సహకరించారా..? అనే కోణంలో విచారణ చేపట్టినట్లు సమాచారం. ఈ విషయమై పిట్లం ఎస్సై రాజును వివరణ కోరగా విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి



కొత్తపల్లి అఖిల్ (ఫైల్)



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసు

భిక్కనూరు: మండలంలోని అంతంపల్లి గ్రామ శివారులో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాలు ఇలా.. భిక్కనూరులో హేయిర్ కటింగ్ షాపు నిర్వహిస్తున్న కొత్తపల్లి అఖిల్ (30) మంగళవారం వేములవాడకు స్నేహితులతో కలిసి వెళ్తున్నా అని ఇంట్లో వారికి చెప్పి, బైక్‌పై బయలుదేరి వెళ్లాడు. అంతంపల్లి–బీటీఎస్ మధ్యలో జాతీయ రహదారిపై రాత్రివేళ అఖిల్ అపస్మారక స్థితిలో కనిపించాడు. స్థానికులు గమనించి నేషనల్ హైవే అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది వెంటనే అక్కడికి అఖిల్‌ను కామారెడ్డికి ఆస్పత్రికి తరలించారు. కానీ వైద్యులు పరీక్షించి అప్పటికే మరణించాడని నిర్ధారించారు. మృతుడికి భార్య సింధు, రెండేళ్ల కూతురు, తల్లిదండ్రులు ఉన్నారు. అఖిల్ బైక్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి మరణించాడా? లేక ఇంకా ఏదైనా కారణం ఉందా అన్న విషయాలు తెలియరాలేదు.

క్రైం కార్నర్


రెండు బైకులు ఢీ: ఇద్దరికి గాయాలు

ఇందల్వాయి: మండలంలోని చంద్రాయన్‌పల్లి గ్రామ శివారులోగల 44వ నంబరు జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం ఓ బైక్ ముందున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. స్థానికులు, అంబులెన్స్ సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా.. చంద్రాయన్‌పల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆపరేటర్‌గా పని చేస్తున్న అశోక్ కామారెడ్డి నుంచి బైక్‌పై వస్తున్నాడు. కామారెడ్డికి చెందిన భరత్ అదేమార్గంలో కామారెడ్డి నుంచి నిజామాబాద్ వైపు బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి అతడిని ఢీకొన్నాడు. ఈప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఇరువురిని టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

ఖలీల్‌వాడి: రెంజల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తాడ్‌బిలోలి గ్రామశివారులోగల పేకాట స్థావరంపై దాడి చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య, స్పెషల్ పార్టీ సిబ్బంది మంగళవారం తెలిపారు. పేకాడుతున్న ఆరుగురిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే వారి వద్ద నుంచి ఐదు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు, రూ. 31,100 నగదును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. తదుపరి చర్య నిమిత్తం రెంజల్ ఎస్సై సాయన్నకు అప్పగించినట్లు తెలిపారు.

అటవీ భూమిని చదును చేసిన ట్రాక్టర్లు స్వాధీనం



సిరికొండ: మండలంలోని తాటిపల్లి గ్రామ సమీపంలోగల అటవీభూమిని చదును చేసిన రెండు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో రవీందర్ మంగళవారం తెలిపారు. ట్రాక్టర్లను స్వాధీనపర్చుకునే సమయంలో అటవీశాఖ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన మాలావత్ మదన్‌లాల్, సావిత్రి, నందిలాల్, మాలావత్ భూపతి అనే వ్యక్తులపై సిరికొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నామన్నారు.

న్యాల్‌కల్‌లో ఒకరిపై దాడి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని న్యాల్‌కల్ గ్రామంలో సోమారపు గంగాధర్‌పై అదే గ్రామానికి చెందిన ముగ్గురు దాడి చేసి గాయపర్చిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన గంగాధర్‌కు రమణ రావు, లక్ష్మణ్, మరో వ్యక్తి ఆదివారం ఫోన్ చేసి పేకాట ఆడుదామని పిలిపించారు. అక్కడికి వెళ్లిన గంగాధర్ తాను పేకాట ఆడబోనని చెప్పడంతో తాగిన మైకంలో ముగ్గురు కలిసి దాడికి పాల్పడ్డారు. గంగాధర్‌కు తీవ్ర గాయాలు కావడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ చోరీ కేసులో నిందితుల అరెస్టు



భిక్కనూరు: బైక్ చోరీ నిందితులిద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్, ఎస్సై ఆంజనేయులు మంగళవారం తెలిపారు. భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా కామారెడ్డిలోని రాజీవ్‌నగర్‌కు చెందిన సోదరులు షేక్ తోఫిక్, షేక్ ఆఫ్రోజ్‌లను అనుమానంతో పట్టుకుని విచారించారు. దీంతో వారు జంగంపల్లి గ్రామంలో, భిక్కనూరులో బైక్‌లను చోరీ చేసినట్లు అంగీకరించారు. అనంతరం వారి వద్ద నుంచి నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు వివరించారు.

ఐదుగురికి 14రోజుల రిమాండ్

ఖలీల్‌వాడి: పోలీసుల వాహనం అద్దాలు ధ్వంసం చేసిన కేసులో ఐదుగురు వ్యక్తులకు జడ్జి 14 రోజుల రిమాండ్ విధించినట్లు మూడోటౌన్ ఎస్సై హరిబాబు మంగళవారం తెలిపారు. నగరంలోని శ్రద్ధానంజ్ గంజ్‌లో ఈనెల 15న సెక్యూరిటీ గార్డుపై కొందరు వ్యక్తులు దాడి చేస్తున్నారనే సమాచారం మేరకు పెట్రో కారులో పోలీసులు ఘటన స్థలానికి వెళ్లారు. ఈక్రమంలో కొంత మంది వ్యక్తులు పెట్రోకారు అద్దాలు పగలగొట్టారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, ఐదుగురు వ్యక్తులను కోర్టు ముందు హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.

ఎస్సైని ఢీకొట్టిన కారు



ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్సై–2 ఉదయ్‌కుమార్ మంగళవారం ఆర్ఆర్‌చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో ఓ కారును ఆపే సమయంలో ఎస్సైని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆయనకు గాయాలు కాగా, వెంటనే సిబ్బంది, స్థానికులు ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. టౌన్ సీఐ శ్రీనివాస్‌రాజు, ఎస్సై శ్రీకాంత్ వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ప్రస్తుతం ఎస్సై ఆరోగ్యం కుదుటపడిందని వైద్యులు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న బొలెరో వాహనం

- ప్రమాదంలో భార్య మృతి, భర్తకు గాయాలు



శకుంతల మృతదేహం

పిట్లం(జుక్కల్): కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రం శివారులోని జాతీయ రహదారిపై మంగళవారం సంగారెడ్డి జిల్లాకు చెందిన దంపతులిద్దరూ బైక్‌పై వెళుతుండగా బొలెరో వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో భార్య మృతి చెందగా, భర్తకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలంలోని అంతర్గామ గ్రామానికి చెందిన శకుంతల, సంగయ్య దంపతులు బైక్‌పై చిన్నకొడప్‌గల్ వైపు బయలుదేరారు. పిట్లం శివారులో వారి బైక్‌ను బొలెరో వాహనం వేగంగా ఢీకొట్టింది. ఈఘటనలో శకుంతల (45) మృతి చెందగా, సంగయ్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న హైవే సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రుడిని పిట్లం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం బాన్సువాడ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసులు నమోదు చేశారు.

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడి మృతి



శ్రీనివాస్‌పై బోల్తాపడిన ట్రాక్టర్

బాల్కొండ: పంటభూమిని దుక్కి దున్నుటకు ఓ వ్యక్తి ట్రాక్టర్‌పై వెళుతుండగా ప్రమాదవశాత్తు వాహనం బోల్తాపడి మృతిచెందాడు. మెండోరా ఎస్సై నారాయణ తెలిపిన వివరాలు ఇలా.. కర్నేబోయిన శ్రీనివాస్(27) అనే వ్యక్తి బతుకు దెరువు కోసం మెదక్ నుంచి వెల్కటూర్‌కు కొన్నేళ్ల క్రితం వలస వచ్చాడు. గ్రామంలో ఇతరుల భూములను కౌలుపై సాగు చేసేవాడు. ఈక్రమంలో గ్రామానికి చెందిన గంగాధర్ ట్రాక్టర్‌ను మంగళవారం అతడు తీసుకుని తాను కౌలు చేస్తున్న పంట భూమిని దుక్కి దున్నుటకు బయలుదేరాడు. మార్గ మధ్యలో ట్రాక్టర్ బోల్తాపడటంతో శ్రీనివాస్ ట్రాక్టర్ కింద ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

కాలువలో పడి ఒకరు..

నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ ప్రధాన కాలువలో పడి ఓ వ్యక్తి మృతిచెందినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. మహమ్మద్ నగర్ మండల కేంద్రానికి చెందిన జగ్గంపల్లి సాయిలు(55) అనే వ్యక్తి ఈ నెల 14న ఇంటి నుంచి బయటకు వెళ్లి, తిరిగిరాలేదు. దీంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. మంగళవారం సింగితం శివారులోని నిజాంసాగర్ ప్రధాన కాలువ అతడి మృతదేహం పోలీసులకు లభ్యమైంది. మృతుడి భార్య సాయవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

బైక్‌ల చోరీ కేసులో ఇద్దరికి ఏడాది జైలు శిక్ష

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో బైక్‌లను చోరీ చేసిన కేసులో ఇద్దరు నిందితులకు ఏడాది సాధారణ జైలు శిక్ష పడినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి సోమవారం తెలిపారు. వివరాలు ఇలా.. గత ఏడాది వరగంటి మోహన్, తెడ్డు నరేష్‌లు తమ ఇంటి ముందర నిలిపిన బైక్‌లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. మోహన్ బైక్‌ను బోధన్‌కు చెందిన మాలవత్ తులసీరాం, నరేష్ బైక్‌ను బోధన్‌కు చెందిన అబ్దుల్ ఆయాజ్‌ఖాన్ చోరీ చేసినట్లు గుర్తించి, అరెస్టు చేశారు. వారిని ఆర్మూర్ కోర్టులో హాజరుపర్చగా, విచారణ అనంతరం జడ్జి నిందితులిద్దరికి ఏడాది సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

మట్కా నిర్వాహకుడికి రెండు రోజులు..

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఆచన్‌పల్లికి చెందిన షేక్ గఫార్ బోధన్‌లో మట్కా నిర్వహిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. బోధన్ కోర్టులోని సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట అతడిని హాజరుపరుచగా జడ్జి రెండు రోజుల జైలుశిక్షను విధించినట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో..

ధర్పల్లి: ధర్పల్లి శివారులోని ఎల్లమ్మ టెంపుల్ వద్ద ఇటీవల పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా ఇందిరానగర్ తండాకు చెందిన సీతారాం మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. దీంతో సీతారాంను మంగళవారం నిజామాబాద్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా జడ్జి అతడికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

నవీపేట మండలంలో..

నవీపేట: నవీపేట్ గ్రామానికి చెందిన మహమ్మద్ నబీ సాబ్, అబ్బాపూర్ (బి) గ్రామానికి చెందిన బాబు, నిర్మల్ జిల్లా కుబీర్‌కు చెందిన ఇసాల రాకేష్ ఇటీవల మద్యం తాగి వాహనాలు నడుపుతూ నవీపేట పోలీసులకు పట్టుబడ్డారు. మంగళవారం వారిని నిజామాబాద్ కోర్టులో హాజరుపర్చగా స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ 2 రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై వినయ్ తెలిపారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాలు ఇలా.. మహమ్మద్ నగర్‌కు చెందని తూర్పటి మోహన్(28) నిత్యం మద్యం తాగి వస్తుండటంతో భార్య కాశవ్వ మందలించేది. అలాగే తరుచూ దంపతుల మధ్య గొడవలు జరుగుతుండేవి. సోమవారం రాత్రి మద్యం తాగివచ్చిన మోహన్, భార్యతో గొడవపడి, అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మనస్తాపం చెంది గ్రామశివారులోని తన తల్లి సమాధి వద్ద ఉన్న చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఇందల్వాయి మండలంలో ఒకరు..



శ్యామ్(ఫైల్)

ఇందల్వాయి: మండలంలోని ఓ వ్యక్తి మానసికంగా సరిగా లేక ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన గాండ్ల శ్యామ్(24) గతంలో గల్ఫ్‌కి వెళ్లి వచ్చాడు. ప్రస్తుతం ఇంటివద్దనే వ్యవసాయ పనులతోపాటు ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈమధ్య అతను మానసికంగా ఆరోగ్యంగా లేకపోవడంతోపాటు మంగళవారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడికి ఇంకా పెళ్లి కాలేదని, మృతుడి తల్లి పోశవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మనోజ్ తెలిపారు.

యువకుడి అదృశ్యం




నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని వెల్గనూర్ గ్రామానికి చెందిన సురిసాని రాజశేఖర్‌రెడ్డి అనే యువకుడు రెండు రోజుల నుంచి కనిపించకుండా పోవడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివకుమార్ మంగళవారం తెలిపారు. రాజశేఖర్ రెడ్డి ఎల్లారెడ్డి ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. ఈ నెల 17న ఉదయం కళాశాలకు వెళ్లిన అతడు ఇంటికి తిరిగిరాలేదు. అతడి తండ్రి హన్మంత్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

దోమకొండలో తల్లీ కూతురు..

దోమకొండ: మండల కేంద్రానికి చెందిన నర్రాగుల కళావతి ఆమె కూతురు భవానీ అదృశ్యమైనట్లు దోమకొండ ఎస్సై స్రవంతి మంగళవారం తెలిపారు. కళావతి సోమవారం భర్త నరసింహులుతో గొడవపడింది. అనంతరం కూతురు భవానీని తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు ఎంత వెతికినా వారి ఆచూకీ లభించలేదు. దీంతో కళావతి పెద్ద కూతురు నికిత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి రవాణా చేస్తున్న ముఠా అరెస్ట్

- 445 గ్రాముల గంజాయి స్వాధీనం



కామారెడ్డి క్రైం: గంజాయి రవాణా చేస్తున్న ఓ ముఠాను కామారెడ్డి రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 445 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ రామన్ వివరాలు వెల్లడించారు. గంజాయి రవాణాపై విశ్వసనీయ సమాచారం రావడంతో దేవునిపల్లి ఎస్సై రాజు ఆధ్వర్యంలో రామారెడ్డి బ్రిడ్జి వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఓ కారు, బైక్‌లపై గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిని నిజామాబాద్‌కు చెందిన రాథోడ్ రవి, సయ్యద్ సాజిద్, కామారెడ్డికి చెందిన దేవుని పృథ్వీ, నిట్టూరి సిద్ధార్థరావు, పసులోటి భానుచందర్‌గా గుర్తించారు. గంజాయిని, వాహనాలను సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

నగరంలో పోలీసు కవాతు



ఖలీల్‌వాడి: నగరంలోని రెండో పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్‌ఫోర్స్ మంగళవారం కవాతు నిర్వహించారు. రానున్న రంజాన్, హనుమాన్ జయంతి వేడుకల నేపథ్యంలో స్టేషన్ పరిధిలోని గోల్‌హనుమాన్ నుంచి కసాబ్‌గల్లీ, గాజులపేట్ తోపాటు హైమద్‌బజార్, నెహ్రూపార్క్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఏసీపీ రాజావెంకటరెడ్డి, టౌన్ సీఐ శ్రీనివాసురాజు, ఎస్సై యాసీన్‌ఆరాఫత్ తదితరులు పాల్గొన్నారు.